క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఏసీపీ శషాంక్‌రెడ్డి

బౌద్ధనగర్: వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శషాంక్‌రెడ్డి మాట్లాడుతూ.. సెల్ ఫోన్‌ల్లో గుర్తు తెలియని వెబ్‌సైట్‌లు, లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ క్రైమ్‌లపై విద్యార్థి దశ నుంచే పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. అదే విధంగా యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐలు సుధాకర్, రాంచంద్రారెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ సుదేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిషన్ చైర్మన్‌ను కలిసిన జేఏసీ నేతలు



ఆకునూరి మురళికి వినతిపత్రం అందజేస్తున్న ఓయూ జేఏసీ నేతలు

లాలాపేట: ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు బుధవారం రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని ఆయన కార్యాలయంలో కలిశారు. విద్యను వ్యాపారంగా చేసుకొని అధిక ఫీజులు దండుకుంటున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ చైర్మన్ గద్దల అంజిబాబు మాట్లాడుతూ రెసోనెన్స్ అనే విద్యాసంస్థ విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తుందన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అనేక విద్యా సంస్థలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఆ లాంటి కళాశాలలు, విద్యా సంస్థలను గుర్తించి వాటిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు మధు, మేడి పవన్, మొగిలిపాక నవీన్, జెల్ల వెంకటేష్,దుబ్బ సురేష్, అందెకృష్ణ, క్యాదసి రవి తదితరులున్నారు.

జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయం తథ్యం

సికింద్రాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలపై తీవ్ర వ్యతిరేకతలతో ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు ఈసారి బీజేపీని గెలిపించేందుకు సమాయత్తం అవుతున్నారని మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని లభినందిన బీజేపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ విద్యావంతులు, యువకులు జూబ్లీహిల్స్‌లో అక్కడి ప్రజలకు మోదీ సుపరిపాలన, దేశాభివృద్ధి అంశాల గురించి వివరించాలని కోరారు. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి ఎంపిక చేసిన 38 మంది బీజేపీ నాయకులు ప్రతినిత్యం జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికి వెళ్లేందుకు ఎంపిక చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనకట్ల హరి, ప్రకాశ్‌గౌడ్, కన్నాభిరామ్, ప్రభుగుప్తా, గణేశ్‌ముదిరాజ్, ఆకారం రమేశ్, శారద తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళ వైద్యుల క్రికెట్ మ్యాచ్

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో 2కె21 బ్యాచ్ ఆధ్వర్యంలో సైనెక్సెస్ పేరిట నిర్వహిస్తున్న కాలేజీ ఫెస్ట్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన మహిళ వైద్యుల క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. చంద్రావతి ఎలెవన్ జట్టు టాస్ గెలిచి 6 ఓవర్లలో ఒక వికెట్‌కు 68 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన దీప్తి ఎలెవన్ జట్టు ఆరు ఓవర్లలో 54 పరుగుల సాధించి 14 రన్స్ తేడాతో పరాజయం పాలైంది. ఇరుజట్లుకు చెందిన బ్యాటర్లు శ్రేయా 38, మాధురి 34, రేఖ 30, సుచరిత 16 పరుగులు సాధించి టాప్‌స్కోర్లర్లుగా నిలిచారు. డాక్టర్ కిరణ్‌మాదల, అబ్బయ్య, లెనిన్, అపూర్వరెడ్డి ఎంపైర్లుగా బాధ్యతలు నిర్వహించారు. క్రీడస్ఫూర్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్న వైద్యులు, వైద్యవిద్యార్థులకు గాంధీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి అభినందించారు. సైనెక్సెస్ పేరిట నిర్వహిస్తున్న కాలేజ్ ఫెస్ట్‌లో ఒక్కో ఇయర్ విద్యార్థులకు బైరవాస్, రుద్ర వంశాస్, త్రిపురాంతకాస్, ధర్మవీరాస్, వృషిధారాస్ పేర్లతో కొనసాగుతారని, ఈనెల 18 వరకు కాలేజ్‌ఫెస్ట్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న మహిళా వైద్యులు

నేడు కంటోన్మెంట్ బోర్డు సమావేశం

- చర్చకు రానున్న పలు కీలకాంశాలు
- ఎజెండాలో ఏఓసీ ప్రత్యామ్నాయ రోడ్లు, రసూల్‌పురా ఫ్లైఓవర్‌ల అనుమతులు
- జైకా పనులకు ఆమోదం లభించేనా?



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం గురువారం ఉదయం 11.00 గంటలకు బోర్డు కార్యాలయంలో జరగనుంది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎస్. రాజీవ్ నేతృత్వంలో జరిగే సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొంటారు. బోర్డు పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు ఆమోదం, టెండర్లు ఖరారు, వివిధ పనులకు సంబంధించి పాలనాపరమైన అనుమతులు, భవన నిర్మాణ అనుమతులు వంటి కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

ఎజెండా అంశాలివే..

- రసూల్‌పురా జంక్షన్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం నాలుగులేన్‌ల ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనుంది. ఇందుకు సంబంధించి కొంత స్థలం కంటోన్మెంట్ పరిధిలోకి వస్తుంది. దీనిపై బోర్డులో చర్చించి అనుమతులు ఇవ్వనున్నారు.
- ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఏఓసీ ప్రత్యామ్నాయ రోడ్లకు సంబంధించిన అంశం మరోసారి బోర్డుకు వచ్చింది. ప్రతిపాదిత ప్రత్యామ్నాయ రోడ్లు విమలానంద, సంతోష్ కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీల గుండా వెళ్లనున్నాయి. ఆయా కాలనీల స్థలాలు ఆర్మీ స్థలంలోకి చొచ్చుకు వచ్చాయంటూ గతంలో డిఫెన్స్ ఎస్టేట్స్ నోటీసులు జారీ చేశారు. ఈ అంశంపై కోర్టులో వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ రోడ్లకు స్థలం కేటాయింపు అంశంపై బోర్డు ఎలా ప్రతిస్పందిస్తుందో వేచి చూడాల్సిందే.
- దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న జైకా లైన్ లేటరల్స్ కనెక్షన్‌ల ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. గతేడాది గీతా ఇంజనీరింగ్ సంస్థకు రూ.1,2 కోట్లకు పనులు అప్పగించారు. అయితే ప్రతిపాదిత పనుల సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన సదరు సంస్థ చేతులెత్తేసింది. రూ.5.58 కోట్లు చెల్లిస్తే పనులు చేపడతామంటూ ప్రతిపాదించింది. ఇందుకు ఆ సంస్థ లేవనెత్తిన అభ్యంతరాలపై బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- ప్యాట్నీ నాలా వద్ద ర్యాంప్, పార్కింగ్ తదితర పనులకు పాలానపరమైన అనుమతులు జారీ చేయనున్నారు.
- కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగులకు క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ విరించి, మల్లారెడ్డి, విజయ హెల్త్ కేర్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు.
- కంటోన్మెంట్‌లో భవన నిర్మాణ అనుమతుల జారీలో మార్టిగేజ్ విధానం అమలులోకి రావడంతో 2013 నుంచి అమల్లో ఉన్న ప్లింత్, ఫైనల్ సాంక్షన్‌ల విధానానికి పూర్తిగా స్వస్తి పలకనున్నారు. 2022 నుంచి ఓబీపాస్ విధానంలో అనుమతులు జారీ చేస్తుండగా, ఆఫ్‌లైన్ అప్లికేషన్‌లకు మాత్రం 2013 నాటి విధానాన్నే కొనసాగిస్తూ వచ్చారు.

ఆన్‌లైన్‌లో కానరాని సర్క్యులర్‌లు..

భవన నిర్మాణాల అనుమతుల జారీకి ఓబీ పాస్ విధానం ప్రవేశపెట్టాక మెజార్టీ భవన నిర్మాణ అనుమతులను సర్క్యులర్ ఎజెండాల రూపంలోనే జారీ చేస్తున్నారు. కొంతకాలం క్రితం వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను సైతం బోర్డు ఎజెండాలో పొందుపరుస్తూ వచ్చారు. ఇటీవల కాలంలో ఈ విధానానికి పూర్తిగా స్వస్తిపలకడంతో నూతన భవన నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియ గోప్యంగా మారిపోయింది. వీటితో పాటు పలు టెండర్లు, పనులకు ఆమోదం వంటి అంశాలను సైతం సర్క్యులర్ ఎజెండాల్లో పొందుపరుస్తున్నారు. వాటి వివరాలు సైతం ఆన్‌లైన్‌లో పొందుపరచడం లేదు. పబ్లిక్ డాక్యుమెంట్‌లుగా వెల్లడి చేయాల్సిన సర్క్యులర్‌ను గోప్యంగా ఉంచడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హాజరు కానున్న నూతన సీఈఓ!

కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ పదోన్నతిపై బదిలీ కావడంతో ఆయన స్థానంలో అర్వింద్ కుమార్ ద్వివేది నూతన సీఈఓగా నియమితులయ్యారు. త్వరలోనే పదవీ బాధ్యతలు స్వీకరించనున్న ఆయన గురువారం నాటి బోర్డు సమావేశానికి హాజరయ్యే అవకాశముందని తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: రోడ్డు ప్రమాదాలను నివారించడం అందరి బాధ్యత అని ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని ఎస్వీఐటీ ఆడిటోరియంలో బేగంపేట టీటీఐ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదాలకు గురై అనేక మంది యువత ప్రాణాలు పోగొట్టుకోవడం విచారకరమని అన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించి వాహనాలు నడపాలని, మద్యం, మత్తు పదార్థాలు వాడి వాహనాలు నడపడం నేరంతో పాటు అత్యంత ప్రమాదకరమని అన్నారు. అతివేగం కూడా ప్రమాదాలకు ప్రధాన కారణమని అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, సరైన లైన్లలో వాహనాలు నడపడం, లైన్లు మారే సమయంలో ఇండికేటర్లు ఉపయోగించడం ఎంతో అవసరమని అన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో మొబైల్ ఫోన్లు వాడొద్దని, సురక్షితమైన సమయంలోనే ఓవర్‌టేకింగ్ చేయాలని సూచించారు. అంబులెన్స్, ఫైర్ ఇంజన్ లాంటి వాటికి వెంటనే దారి ఇవ్వాలని చెప్పారు. పాదాచారులు నడిచేందుకు ఫుట్‌పాత్‌లను వాడాలని, జీబ్రా క్రాసింగ్ వద్ద రోడ్డు క్రాస్ చేయాలని, ఆగివున్న పెద్ద వాహనాల మధ్య, ముందు నుంచి రోడ్ క్రాస్ చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శంకర్‌రాజు, టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్, కళాశాల అధ్యక్షులు పీఎల్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ నరేష్‌యాదవ్, ప్రిన్సిపాల్ ఈశ్వర్‌దరా, ఫిజికల్ డైరెక్టర్ పండరి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన పత్రాల అందజేత



అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

లాలాపేట: సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకుడు డా. కేతావత్ సైదులు, మరో అధ్యాపకుడు యెడవెల్లి సైదులు నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రామ్ డిగ్రీ కాలేజీలో బుధవారం జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు కెతావత్ సైదులు 'జానపద కళలు, భక్తి ప్రబోదం అనే అంశంపై, అధ్యాపకుడు యెడవెల్లి సైదులు జానపద గేయాలు తెలంగాణ భాషా విశేషాలు అనే విషయంపై ప్రసంగిస్తూ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. బంగ్లాభారతీ అంతర్జాతీయ సదస్సులో పత్రాలను సమర్పించిన అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు.

కులాల మధ్య చిచ్చుపెట్టొద్దు

– రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షుడు రామ్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

రాంగోపాల్‌పేట్: రాజకీయ పార్టీల నాయకులు తమ స్వ ప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చుపెట్టే కార్యక్రమాలు చేయ్యొద్దని రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షుడు రామ్‌రెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో రెడ్డి జేఏసీ విస్తత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రిజర్వేషన్ల ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి రాజ్యాంగ సవరణ లేకుండా రిజర్వేషన్ల అమలుపై ఎవరికి తోసింది వాళ్లు మాట్లాడుతూ సొంత రాజకీయ ప్రయోజనాలు వెతుక్కుంటున్నారని అన్నారు. గతంలో ఎన్నో సందర్భాల్లో సుప్రీం కోర్టు రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఉండాలని తీర్పులు ఉచ్చిందని గుర్తు చేశారు. గతంలో మహారాష్ట్రలో 2019 స్థానిక సంస్థల ఎన్నికలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పిస్తూ నోటిఫికేషన్ విడుదల చేయడంతో కిషన్‌రావు అనే వ్యక్తి కేసు వేయడంతో ఎన్నికల ఫలితాలను నిలిపివేయాలని ఆదేశాలిచ్చి, 2021లో ఈ ఎన్నికలను రద్దు చేసిందని చెప్పారు. రిజర్వేషన్లకు పెంచుకుంటూ పోవడం వలన రూ.వేల కోట్ల ప్రజాధనం వృథా అవుతుందనేది రాజకీయ నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. బీహార్ తదితర రాష్ట్రాల్లో కూడా కోర్టులు జోక్యం చేసికొని ఎన్నికలను నిలిపివేసిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు. మేము ఏ కులాలకు వ్యతిరేకం కాదని, రాజ్యాంగం, చట్టం ద్వారా సంక్రమించే హక్కులను మాత్రమే కోరుతున్నామని దీనికి ప్రజల మద్దతుతో పోరాడుతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జేఏసీ కో చైర్మన్ హరినాథ్‌రెడ్డి, ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: ఫీడర్ల మరమ్మతులతో గురువారం సీతాఫల్‌మండి, మోండా మార్కెట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీఎస్ఎస్పీ డీసీఎల్ ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు గాంధీ విగ్రహం ఫీడర్ పరిధిలో గాంధీ విగ్రహం, ఎంసీహెచ్‌పార్కు, లైఫ్‌స్ప్రింగ్ ఆస్పత్రి, ఈ సేవా, బొందలగడ్డ, బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతాల్లో, ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు గాంధీనగర్ పీఎస్ ఫీడర్ పరిధిలోని గాంధీనగర్ పీఎస్, బోయిగూడ గార్డెన్, సున్నంబట్టి, రైల్వే క్వార్టర్స్, ప్రభుత్వ హైస్కూల్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పాలికాబజార్ ఫీడర్ పరిధిలోని పాలికాబజార్, సీఎస్ఐ చర్చి, ప్రకాష్ ఆస్పత్రి, ఓల్డ్ గాంధీ ఆస్పత్రి, అఫ్జల్ అల్లావుద్దీన్ క్రిష్టల్‌ప్లాజా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

కంటోన్మెంట్ ఏడీఈ పరిధిలో..

కంటోన్మెంట్ ఏడీఈ (సీబీడీ) పరిధిలోని అడ్డగుట్ట, మచ్చబొల్లారం, హకీంపేట్, గన్‌రాక్ సబ్‌స్టేషన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని ఫీడర్ల మరమ్మతులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు తుకారంగేట్, చింతల్‌బస్తీ ఫీడర్ పరిధిలోతుకారంగేట్-ఏ, డీ సెక్షన్లలో, చింతల్‌బజార్, వివేకానంద నగర్, ఆదిత్య బ్యాంక్ కాలనీ, బొబ్బిలినగర్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు రిసాలాబజార్, జింఖానా ఫీడర్ పరిధిలోని రిసాలబజార్, ప్రేమ్ నగర్, జీఎస్ఆర్ ఎన్‌క్లేవ్, బంజారా విలేజ్, కుటియ మందిర్ ప్రాంతాల్లో,గన్‌రాక్ సెక్షన్ ఏబీసీ, సూర్యనగర్, కోషాశాలియా స్టేడియం, అమరావతి కాలనీ, కార్ఖానా, అవంతికాలనీ, న్యూవాసవినగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ప్రపంచ విద్యార్థుల దినోత్సవం



రాష్ట్రపతి నిలయంలో ప్రపంచ విద్యార్థుల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

బొల్లారం: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో మంగళవారం ప్రపంచ విద్యార్థుల దినోత్సవం వేడుకలను నిర్వహించారు. అలాగే భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డా. ఏపీజే అబ్దుల్‌కలాం జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్- 2047 అనే అంశంపై ప్రాజెక్ట్ షోకేస్ ఏర్పాటు చేశారు. వివిధ పాఠశాలలు, ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు సమర్పించిన సృజనాత్మక ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. మొత్తం 25 ప్రాజెక్టుల్లో, ప్రణవ్ ఇంటర్నేషనల్ స్కూల్-డీప్ స్పేస్ కమ్యూనికేషన్, జెడ్పీహెచ్ఎస్ వనస్థలిపురం - స్మార్ట్ హౌస్, భారతీయ విద్యా భవన్-స్పెక్ట్రల్స్ ఫర్ బ్లైండ్ పీపుల్, ఒసిమమ్ ఇంటర్నేషనల్ స్కూల్ -వెస్ట్ టు ఎనర్జీ కన్వర్షన్, జెడ్పీహెచ్ఎస్ యరగ్రుంట - బ్లైండ్‌మాన్ స్టిక్.. ప్రాజెక్టులు అత్యుత్తమ ఐదు ప్రాజెక్టులుగా ఎంపికయ్యాయి. అలాగే, అక్టోబర్ 15న విద్యార్థులందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తూ ప్రవేశ రుసుము మాఫీ చేశారు. మొత్తం 1,840 మంది విద్యార్థులు రాష్ట్రపతి నిలయం సందర్శించి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ కోసం అధికారుల పర్యటన

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ముందు చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ, స్కై వాక్ నిర్మాణం కోసం క్షేత్రస్థాయిలో వివిధ శాఖల అధికారుల బృందం బుధవారం పర్యటించింది. హెచ్ఎండీఏ, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, ఆర్టీసీ అధికారులు ఈ పనులను పరిశీలించి ప్రస్తుతం ఉన్న 60 అడుగుల రోడ్డును 120 అడుగులకు విస్తరించనుండటంతో రోడ్డు విస్తరణ ఎలా చేపట్టాలని పరిశీలించారు. ఒక వైపు రైల్వేస్టేషన్, గణపతి దేవాలయం, మసీదు, రెతిఫైల్ బస్టాండ్ ఉండగా రెండోవైపు ప్రైవేట్ ఆస్తులున్నాయి. ముందుగా రెతిఫైల్ బస్టాండ్ వైపు రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన తర్వాత మరోవైపు చేపడితే ఎలా ఉంటుందనేది అధికారులు సమాలోచన చేశారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఆర్టీసీ డీవీఎం పవిత్ర, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రెండు మెట్రో స్టేషన్లను కలుపుతూ స్కై వాక్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ముందు వలయాకారంగా పిల్లర్లు లేకుండా స్ప్రింగ్‌ల సహాయంతో ఈస్ట్, వెస్ట్ మెట్రో రెండు స్టేషన్లను కలుపుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా స్కై వాక్ నిర్మించనున్నారు.

ఆయుష్, యోగా సేవలు కొనసాగించాలి



రోగి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

అమీర్‌పేట: మనిషి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం ఆయుష్, యోగా సేవలు కొనసాగించాలని హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అవేక్ క్రానియోటమి శస్త్ర చికిత్స చేయించుకున్న మహిళ బాలమణితో మాట్లాడారు. క్రానియోటమి అనేది మెదడు శస్త్ర చికిత్స చేసే విధానమని, రోగి మేల్కొన్న స్థితిలో ఉండగానే శస్త్ర చికిత్స నిర్వహిస్తారని వైద్యులు వివరించారు. మనిషి మాట, కదలిక, మెదడు కార్యకలాపాలను పర్యవేక్షించి సమస్యకు పరిష్కారమార్గం చూపవచ్చని చెప్పారు. డయాలసిస్ యూనిట్, న్యూరో సర్జరీ, క్యాథ్‌ల్యాబ్, ఆపరేషన్ థియేటర్ల వంటి ముఖ్య విభాగాలను పరిశీలించారు. అనంతరం మెడికల్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో ముఖాముఖిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించటానికి ప్రముఖ వ్యక్తుల ద్వారా గెస్ట్ లెక్చరర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యమైన విద్య, సమగ్ర వైద్య సేవలను అభినందించారు. వెంట కళాశాల డీన్ శిరీష్‌కుమార్ జి.చౌహాన్ ఉన్నారు.



సీపీఆర్ అవగాహన ర్యాలీలో గాంధీ పాలనయంత్రాంగం, వైద్యులు, సిబ్బంది

సీపీఆర్‌పై అవగాహన అవసరం

గాంధీఆస్పత్రి: సాధారణ ప్రజలతో పాటు ప్రతిఒక్కరికీ కార్డియో పల్మనరీ రీసస్కిటేషన్ (సీపీఆర్)పై అవగాహన అవసరమని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి అన్నారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్ (ఎన్ఈఎల్ఎస్) నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ కిరణ్ మాదల నేతృత్వంలో గాంధీ ప్రాంగణంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్డియాక్ అరెస్ట్ (గుండెపోటు)తో దేశంలో ప్రతీ నాలుగు వేల మందిలో ఒకరు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఈ మరణాలు ఆస్పత్రుల వెలుపలే జరుగుతున్నాయని, సకాలంలో ఆస్పత్రిలో చేరితే ప్రాణాపాయం నుంచి బయట పడొచ్చని వివరించారు. గుండెపోటుకు గురైన బాధితులకు సీపీఆర్ చేసి పునర్జన్మ ప్రసాదించవచ్చని, ప్రతిఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన, శిక్షణ కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్లకార్డులతో నినాదాలు చేస్తు గాంధీ ప్రాంగణంలో సీపీఆర్ అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఈఎల్ఎస్ నోడల్ ఆఫీసర్ కిరణ్‌మాదల, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు, అనస్టీషియా, డీవీఎల్ విభాగ హెచ్ఓడీలు మురళీధర్, సుధారాణి, వైద్యులు అబ్బయ్య, చంద్రావతి, జుబేర్, వైద్యులు, వైద్యవిద్యార్థులు, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఓయూలో అధ్యాపకుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు

లాలాపేట: ఇటీవల ఓయూలో నిర్వహించిన సీఏఎస్-2025 ఇంటర్వ్యూల ప్రమోషన్స్‌లో అన్యాయం జరిగిందంటూ ఔటా అధ్యక్షుడు ప్రొ.మనోహర్ ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం ఆర్ట్స్ కళాశాల నుంచి ఓయూ పాలనా భవనం వరకు అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ అధ్యాపకుల పనితీరు బాగా లేదని, 50 ఏళ్ల ఓయూ చరిత్రలో 48 అధ్యాపకులకు ప్రమోషన్స్ ఇవ్వకుండా రిజెక్ట్ చేయడం దారుణమన్నారు. దీని ద్వారా ఓయూ వీసీ ఎలాంటి సమాచారం ఇవ్వనున్నారని వారు ప్రశ్నించారు. యూనివర్సిటీ చరిత్ర దిగజారే ప్రమాదం ఉందన్నారు. దీనిపై ఓయూ వీసీ స్పందించి అర్హత కలిగిన అధ్యాపకులందరికీ తగిన న్యాయం చేయాలన్నారు. అధ్యాపకులు చేస్తున్న ఆందోళనకు ఔటా కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పరశురాం మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో నతానియేలు, వెంకటేశ్వర్లు, వెంకటదాస్, రోజారాణి, రామకృష్ణ తదితరులున్నారు.

మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన



లాలాపేట: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మనోజాగృతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో లార్జెస్ట్ మాస్ సైకాలజికల్ ఫస్ట్ ఎయిడ్ సెషన్ ప్రపంచ రికార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కున్ హుండాయ్ సంస్థ గ్రూప్ ట్రైనర్ గవర్రాజు శేషుబాబు పాల్గొని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సూపర్ వైజర్ పాల్గొని ప్రత్యేక గుర్తింపు పొందారు. మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రజల్లో సానుకూల ఆలోచనలు ప్రోత్సహించడంలో శేషుబాబు ఎంతగానో కృషి చేస్తున్నారు. ఆయనను అభినందిస్తూ మనోజాగృతి సంస్థ అధినేత డాక్టర్ గీత చల్లా శేషుబాబుకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

యువత అబ్దుల్ కలాం మార్గంలో నడవాలి

విద్యార్థులు యువత అబ్దుల్ కలాం మార్గంలో నడుస్తూ వారి ఆశయాలను సాధించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్‌గౌడ్ అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఆయా డివిజన్లల్లో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ చిన్నతనం నుంచి పేదరికంలో పెరిగి అనేక కష్టాలను ఓర్చుకొని విద్యనభ్యసించిన గొప్ప వ్యక్తి అబ్దుం కలాం అని పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకుడిగా, ప్రొఫెసర్‌గా సేవలందించి భారత దేశంలోనే అతిపెద్ద శాస్త్రవేత్తగా ఎదిగి భారత రాష్ట్రపతిగా దేశానికి సేవలు అందించిన మహానీయుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు.



బౌద్ధనగర్: అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బౌద్ధనగర్ దుకాణదారులు

– సికింద్రాబాద్/కంటోన్మెంట్/సనత్‌నగర్ జోన్ బృందం



లాలాపేట: అబ్దుల్ కలాం జయంతిలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి



సనత్‌నగర్: అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోట నీలిమ, విశాల్ సూదం